విజయవాడ వార్త

# వాటర్ ట్యాంక్‌ను ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురండి : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త:** వాటర్ ట్యాంక్‌ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అనంతరం హై టెన్షన్ లైన్ రోడ్లో పర్యటించి ఆ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటమటలోని అన్నా క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆహారంలో నాణ్యత, త్రాగునీరు, వాడుకనీటి



అజీ్బపేట, ఏలూరు రోడ్డు, గుణదల, మహానాడు రోడ్డు, ఆయుష్ హాస్పటల్ రోడ్, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు రోడ్లు గల కనకదుర్గనగర్‌లో జరుగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణపనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. డెంటల్ కళాశాల రోడ్డు, గుణదలలో గల మరుగుదొడ్లను పరిశీలించి అందులో ఉన్న మరమ్మత్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నగరంలో అన్ని మరుగుదొడ్లు ఎటువంటి మరమ్మత్తులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఏమైనా మరమ్మత్తులు ఉంటే వెంటనే వాటిని పూర్తి చేయాలన్నారు. సరఫరా, పారిశుద్ధ నిర్వహణను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో ఆహారం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే అన్ని సౌకర్యాలలో ఎటువంటి సమస్యలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్‌రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్(వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.సామ్రాజ్యం, గోపాలకృష్ణ, ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలనాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో, తహాశీల్దార్

**తిరువూరు, మార్చి 25, ప్రభాతవార్త :** నూతనంగా తిరువూరు ఆర్డీవోగా నియమితులైన ఏ.కుమార్ మరియు తిరువూరు తహసీల్దార్‌గా పి.వైకుంఠరావు'లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ క్రమంలో వారిని తిరువూరు పోలీస్ ఎస్ఐ వైవి.శాతకర్ణి మర్యాదపూర్వకంగా కలిసి, శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు భద్రత విషయాల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో మరియు ఎమ్మార్వో'ల పరిపూర్ణ సహకారాన్ని కోరారు.





# గ్రామాల్లో కృష్ణాజిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

**మచిలీపట్నం, మార్చి 25, (ప్రభాతవార్త) :** కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ బుధవారం పెడన, చల్లపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. తొలుత పెనుమల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల స్థితిగతులపై ఆరా తీశారు. మరోవైపు స్వామిత్వ సర్వే వివరాలను పరిశీలించారు. చల్లపల్లిలోని నారాయణరావు నగర్ ను సందర్శించి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. 9వ తరగతి చదువుతూ 10వ తరగతికి వెళ్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిర్మాణ వాలంటీర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ధైర్యం చెప్పి సరైన విధంగా ప్రోత్సహిస్తూ చదువులో ముందుకు సాగాలన్నారు. చే ఏడాది 10వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఉన్నత పాఠశాలలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బ్రిడ్జి కోర్సు ఏ విధంగా ఉపయోగించు కుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పెనుమల్లి గ్రామంలో గ్రామంలో 9 వ తరగతి చదివిన నిడుమోలు రాగ ఉషాలత బ్రిడ్జ్ కోర్స్ ఎలా చదువుకుంటుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని కాగిత లాస్యను చదువు గురించి ప్రశ్నించి ఆహారం బాగా తినాలని పాఠశాలలో చిక్కి కోడిగుడ్డు ఇస్తున్నారా తింటున్నావా, రాగిజావ



తాగుతున్నావా అని ప్రశ్నించగా ఆ అమ్మాయి అన్నిటికీ అవునని చాలా స్మార్ట్ గా సమాధానాలు చెప్పడంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాంటి పిల్లలు ఏ కారణం చేతనైనా చదువు మధ్యలో ఆపివేస్తే వారు జీవితాంతం వెనకబడిపోయి బాధపడతారన్నారు. అనంతరం పెనుమల్లి గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి స్వామిత్రా రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సరిగా

## విద్యార్థుల స్థితిగతుల పై ఆరా..

పని చేస్తున్నారో లేదో కూడా పరిశీలించారు. రెండుమూడు వీధులు తిరిగి ఇళ్ల కొలతలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు రాకుండానే స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఆన్లైన్ ద్వారా పన్నులన్నీ ఇంటి వద్ద నుంచే చెల్లించే అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో స్వామిత్రా సర్వే జరుగుతుందని, సర్వే ద్వారా గ్రామ కంఠంలో ఉన్న ఇంటింటికి తిరిగి ఆస్తి హక్కు కార్డులు ఇచ్చారా లేదా సర్వే సరిగా చేశారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పర్యటిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సర్వే భూ రికార్డుల ఏడి లక్ష్మణ్ బాబు, డిఎల్‌డిఓ పద్మ, డి ఎల్ పి ఓ రజావుల్లా, తహసిల్దారు అనిల్ కుమార్, ఎంఈఓ లు హరినాథ్, సలోమి, సర్పంచ్ రామానాయుడు, జడ్పిటిసి ఆర్జా వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

## -అధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్న 'విష్ణుబొట్ల'

-30 సంవత్సరాల సీనియారిటీలో మరోసారి ఎన్నికైన 'పడవల'

-10 సంవత్సరాల సీనియారిటీతో ఉషారాణి, సంధ్యారమణిలు ఏకగ్రీవం







**విజయవాడ కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త :** బెజవాడ బార్‌లో 45 సంవత్సరాల తర్వాత బార్ అధ్యక్ష స్థానాన్ని ఏకగ్రీవంగా విష్ణుబొట్ల లక్ష్మీనారాయణ కైవసం చేసుకున్నారు. బార్ నూతన అధ్యక్షునిగా విష్ణుబొట్ల నియామకమవ్వడంతో పలువురు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల సీనియారిటీ విభాగంలో ఇసి మెంబర్‌గా సీనియర్ న్యాయవాది పడవల ఏడుకొండలు, 20 సంవత్సరాల సీనియారిటీలో విభాగంలో ఇసి మెంబరుగా జీవన్ స్వామి, 10 సంవత్సరాల సీనియారిటీ విభాగంలో ఇసి మెంబర్లుగా కొలుసు ఉషారాణి, సంధ్యారాణి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన బెజవాడ బార్ నూతన అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ తదితరులకు బార్ ప్రసుత అధ్యక్షులు ఎకె భాషా, ప్రధాన కార్యదర్శి కెవి రంగారావు, వివి గురునాథం తదితరులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం బార్ ప్రధాన కార్యదర్శి పదవికి బైపూడి నాగేశ్వరరావు, వల్లిబోయిన కిరణ్‌కుమార్‌లు, ఉపాధ్యక్ష పదవికి బందారుపల్లి లెనిన్, బి.సత్య వసుంధర, చిన్నం రామకృష్ణ, కోశాధికారి పదవికి వి.జయలక్ష్మి తదితరులు పలు పదవులకు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 26వ తేదీ నామినేషన్ల పరిశీల అనంతరం 27వ తేదీన ఉపసంహరణకు గడువు తేదీలను ప్రకటించారు. ఈ నెల 31వ తేదీన బెజవాడ బార్ ఎన్నికలు జరుగుతాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన పదవులు మినహా మిగిలిన పదవులకు ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ పూర్తయిన అనంతరం విజేతలను ప్రకటిస్తారు.

# చట్టవిరుద్ధ, దేశ ద్రోహ కార్యకలాపాల కేసులో మరి కొంత మంది అరెస్టు

**విజయవాడ కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త :** తీవ్ర చట్టవిరుద్ధ, దేశ ద్రోహ కార్యకలాపాల కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన విజయవాడ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన మహిళ సైదా బేగంను కూడ అదుపులోకి తీసుకున్నారు. నేపథ్యంలో ఈ కేసులో మొత్తం 12 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు అరెస్ట్ అయిన నలుగురు నిందితులకు దేశం వెలుపల ఉన్న కొంతమందితో సంబంధాలున్నాయని, దేశ సార్వభౌమత్వం, ఐక్యత, భద్రతకు



హైదరాబాద్, చంచల్‌గూడ లోని బేగం ఇంటిలో కూలంకుషంగా సోదాలను ఇప్పటికే నిర్వహించినట్లు సమాచారం. ఈమెతో పాటు బెంగుళూరుకు చెందిన అబ్దుల్ సలాం అనే మరో వ్యక్తిని కూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్కరి వద్ద ఒక్కొక్క సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ సెల్‌ఫోన్ డేటాను విశ్లేషించి, దానిలో ఉన్న వివరాల ఆధారంగా ఈ కేసులో ఇంకా ఎంత మంది ప్రమేయం ఉందో పోలీసులు కూపీ లాగుతున్నట్లు సమాచారం. వీరిని కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి వచ్చే నెల 6 వరకు వీరికి రిమాండును విధించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిని విచారించగా వారిచ్చిన సమాచారం మేరకు వీరిని అరెస్ట్ చేసినట్లు తెలియవచ్చింది. ఆన్‌లైన్‌లో గ్రూపులను నిర్వహిస్తూ తీవ్రవాద భావజాలానికి సంబంధించిన కంటెంట్‌ను వ్యవస్థీకృతంగా ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై ఇప్పటికే విజయవాడ వించిపేటకు చెందిన ముగ్గురు యువకులను విజయవాడ టు టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసిన విషయం విదితమే. వారిని విచారించిన భంగం కల్గించే చర్యలకు వారు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఐక్యూఐఎస్, ఐఎస్ఐఎస్ పేర్లతో రెండు గ్రూపులు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు ఒక గ్రూపుగా ఏర్పడి పోస్టింగులు పెడుతున్నట్లు కూడ పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇప్పటికే అరెస్ట్ అయిన ముగ్గురి నుండి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక గ్రూపులో ఐదుగురు, మరో గ్రూపులో ఏడుగురు సభ్యులున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మంగళవారం అరెస్ట్ అయిన వారిచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ లోని సైదా బేగం ఇంటిలో క్షుణ్ణంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. సైదా బేగంతో పాటు బెంగుళూరుకు చెందిన అబ్దుల్ సలాంను కూడ పోలీసులు ఉగ్రలింకుల కేసులో విజయవాడ కోర్టులో బుధవారం హాజరుపర్చారు. వీరికి ఏప్రిల్ 6 వరకు న్యాయస్థానం రిమాండును విధించింది. ఈ కేసులో నిందితులైన మిగిలిన వారిని అదుపులోకి తీసుకోవడం కోసం ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే విజయవాడ పోలీసులు బయలుదేరి వెళ్ళినట్లు సమాచారం.

# నిర్మాణ వ్యర్థాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

## -కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త :** నగరంలోని నిర్మాణ వ్యర్థాలు ఎక్కడున్నా వాటిని అజిత్‌సింగ్‌నగర్ లోని గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్‌కు తరలించి, అక్కడున్న సి అండ్ డి ప్లాంటును ఉపయోగించి నిర్మాణ పదార్థాలతో పాదచారుల కోసం వేసే పేవర్ బ్లాక్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి అభివృద్ధి పనుల్లో ఉపయోగించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తన పర్యటనలో భాగంగా ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్‌లోని సి అండ్ డి ప్లాంట్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాలన్నా విజయవాడ నగరపాలక సంస్థ నుండి పొందవచ్చన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రణాళికాధికారులు ఎప్పటికప్పుడు డ్రోన్‌తో పర్యవేక్షిస్తూ నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా నిర్ధారించుకోవాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# జనభా గణనలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర అత్యంత ముఖ్యం : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త** జనాభా గణన అత్యంత పారదర్శకంగానూ, ఖచ్చితత్వంతోను జరుపడానికి ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర అత్యంత ముఖ్యమైందని, ఈ సారి జనాభా గణన



పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతున్నందున అత్యంత జాగ్రత్తగా జనాభా గణన చేపట్టాల్సి ఉందని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. 2027వ సంవత్సరంలో చేపట్టబోయే జనభా గణనలో భాగంగా మొదటి విడతలో హౌస్ లిఫ్టింగ్ ఆపరేషన్ చేపట్టాల్సి ఉన్నందున దానిని జరపడానికి మాస్టర్ ట్రైనర్స్‌గా నియమించబడిన వివిధ కళాశాలల లెక్చరర్లు, ఉపాధ్యాయులకు కార్పొరేషన్‌లో ఈ నెల 23 నుండి 25 వరకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణా శిబిరాలు ఈ రోజుతో ముగిసాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జనాభా గణన అత్యంత పారదర్శకం గాను, ఖచ్చితత్వంతోనూ జరపడానికి ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర అత్యంత ముఖ్యమైందని, అందరూ ఫీల్డ్ ట్రైనర్స్ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఒర్పుతో, పూర్తి స్థాయిలో తగు రీతిన శిక్షణ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్, సిటీ సెన్సెస్ ఆఫీసర్ రవీంద్రరావు, డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ నుండి సిహెచ్ వెంకటరమణ, మాస్టర్ ట్రైనర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 18న విజయవాడలో ఓబీసీల రాష్ట్ర సదస్సు

## ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ వెల్లడి

**విజయవాడ, మార్చి 25, ప్రభాతవార్త :** ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34% రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సీఎం 2026లో చేపట్టే జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన చేపట్టాలనీ తద్వారానే దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని వరప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు.



చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్‌లో ఒక హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలో 52% జనాభా కలిగిన బీసీలకు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో హామీ అమలుకు రావాలంటే రాజ్యాంగ సవరణ ఏకైక మార్గమన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులో కూడా ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని బీసీ డిమాండ్ల సాధన కు ఏప్రిల్ 18న ఓబీసీ ల రాష్ట్ర స్థాయి సదస్సును విజయవాడ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో కేంద్ర రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నవ సుబ్బారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యు పేరయ్య, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి బత్తుల కాశీవిశ్వనాథ్, నగర నాయకులు త్రినాథ రావు, మహిళా సంఘం నగర నాయకురాలు పద్మలత, సుస్మిత తదితరులు పాల్గొన్నారు

# శ్రీ విజయ గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**తిరువూరు, మార్చి 25, ప్రభాతవార్త :** తిరువూరు తంగిల్ల బీడులో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ విజయ గణపతి ఆలయ పనులకు బుధవారం అర్చకులు భూమి పూజ నిర్వహించగా, శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, కొల్లివర సుబ్బారావు తదితరులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పెట్రోల్ కోసం బారులు తీరిన వాహన దారులు

**తిరువూరు, మార్చి 25, ప్రభాతవార్త :** పెట్రోల్ స్టాక్ లేదని రావడం ఆలస్యం అవుతుందని ప్రచారం జరుగు తుండటంతో తిరువూరు డివిజన్‌లో పెట్రోల్ బంకుల వద్ద బుధవారం తీవ్ర రద్దీ నెలకొంది. పలు బంకుల్లో స్టాక్ లేకపోవడంతో ఉన్న బంకుల్లో అధిక సంఖ్యలో వాహనదారులు క్యూ కట్టారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : ఎంఈవో బాలాజీ

**కంచికచర్ల మార్చి 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎంఈవో బాలాజీతో కలసి ఎంపియూపి ప్రధానోపాధ్యాయురాలు దుర్గాదేవి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సురేష్ బాబు, నాగేశ్వరరావు, రహంకాతుమ్, గ్రేస్ నాని తదితరులు గత రెండురోజులుగా పట్టణంలోని హరిజనవాడ, అంబేద్కర్ నగర్ ప్రాంతాలలో పర్యటిస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. మన ఊరు-మన బడిని కాపాడుకోవాలని ఎంఈవో బాలాజీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.



# సమగ్ర భూసర్వే వేగంగా పూర్తిచేయాలి : జెసి ఇలక్కియ

**ఎ కొండూరు, మార్చి 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తిరువూరు పర్యటనకు వెళుతూ మధ్యలో మండల కేంద్రమైన ఎ కొండూరులో ఆగి రాష్ట్ర ప్రభుత్వం తావు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జెసి ఇలక్కియ సర్వే సిబ్బందిని ఆదేశించారు. సర్వే పనుల్లో ఉపయోగిస్తున్న పరికరాలు మ్యాపింగ్ విధానాలను జెసి



ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వే అమలును ఆకస్మికంగా తహసీల్దారన నడకుడ అరవింద్‌తో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి ఇలక్కియ మాట్లాడుతూ భూసర్వే ప్రకియను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. గ్రామాల్లో భూముల సరిహద్దులు సమగ్రంగా గుర్తించాలని, భూయజమానుల వివరాలను సమగ్రం నమోదు చేసి ఎటువంటి వివాదాలకు ఇలక్కియ పరిశీలించారు. ఈ సమగ్ర భూ సర్వే వల్ల భూములపై స్పష్టమైన రికార్డులు తయారు చేస్తారని భవిష్యత్తులో యీ కార్యక్రమం వల్ల భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. స్థానికంగా ఈ సమగ్ర భూసర్వేకు సహకరించాలని జెసి ఇలక్కియ కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నడకుడ అరవింద్, ఆర్ఐ దివ్య ప్రసాద్, విర్వోలు తహాశీల్దారు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజల దాహార్తి తీర్చటానికే మంచినీటి చలివేంద్రాల ఏర్పాటు

## ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు

**ఎ కొండూరు, మార్చి 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎ కొండూరు మండలం ఎ కొండూరు కంభంపాడు చీమలపాడు రామచంద్రాపురం గ్రామాల్లో విజయవాడ మైలవరం తిరువూరు జాతీయ రహదారి వెంబడి వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలు పాదచారులు ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌లు, సెక్రటరీలు, పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ల సాకారంతో ఈ చల్లటి మంచినీటి చలివేంద్రాలను నెలకొల్పి ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ఈ చలివేంద్రాలను నెలకొల్పినట్లు తెలిపారు. ఈ చలివేంద్రాల్లో శుద్ధిచేసిన మంచినీరు అందుబాటులో ఉండేలా పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులను సెక్రటరీలను ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించినట్లు ఎంపిడివో బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ కొండూరు సెక్రటరీ సుధాకర్, చీమలపాడు అభివృద్ధి అధికారి బి.గోపికృష్ణ, కంభంపాడు సెక్రటరీ రాచమళ్ల వెంకటేశ్వరరావు, రామచంద్రాపురం సెక్రటరీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే గ్రూప్ డి పరీక్షల ఉచిత శిక్షణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

**విజయవాడ తూర్పు, మార్చి 25 (ప్రభాతవార్త) :** రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్‌డి పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన 100 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణపత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు మాత్రమే), బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సు, రైల్వే రిక్రూట్‌మెంట్ గ్రూప్‌డి దరఖాస్తు పత్రం జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతపరిచి ఈ నెల 30వ తేదీలోగా విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం డోర్ నెం.7421/5, అశోక్‌నగర్, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ520007కు అందజేయాలన్నారు.

# జ్ఞాన సమపార్జనకు సదస్సులు దోహదం : రిజిస్ట్రార్ సింహాచలం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి25, ప్రభాతవార్త:** విద్యార్థులు, పరిశోధకుల మేధస్సు పెంపుకు, జ్ఞాన సమపార్జనకు సదస్సులు దోహదపడతాయని ఏఎన్‌యు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. 3రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ద్వారా పరిశోధకులు నేర్చుకున్న కొత్త విషయాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించాలని పేర్కొన్నారు. వర్సిటీలోని డా.ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఫిన్‌టెక్



ఇన్నోవేషన్స్ అండ్ బిజినెస్ అప్లికేషన్స్ అనే అంశంపై 3రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో సదస్సుకు పరిశోధనా పత్రాలు సమర్పించిన పరిశోధకులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్యఅతిగా పాల్గొన్న ఆలీప్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షురాలు కె.రమాదేవి మాట్లాడుతూ దేశంలో మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉన్న అవకాశాలను వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న గన్నవరంలోని హెచ్‌సిఎల్ ఏఐ క్లబ్ ప్రెసిడెంట్ బొర్రా సురేష్ మాట్లాడుతూ ఏఐ, బ్లాక్ చైన్ టెక్నాలజీతో దేశ ఆర్థిక రంగం, బ్యాకింగ్ రంగంలో వచ్చే సమూల మార్పులను వివరించారు. సదస్సు డైరెక్టర్, ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులకు ఫిన్ టెక్ సాంకేతికతపై శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్, విభాగం హనరరీ ప్రొఫెసర్ ఆచార్య వి.చంద్రశేఖరరావు, అధ్యాపకులు డాక్టర్ విజయవాణి, డాక్టర్ జి.ఉమా, డాక్టర్ డి.రాజశేఖర్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ పి.శ్యామలాదేవి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతిభకు వైకల్యం ఎట్టిపరిస్థితుల్లో అడ్డంకి కాదు : తమ్మిరెడ్డి శివశంకర్

**గుంటూరు కల్చరల్,మార్చి 25,ప్రభాతవార్త :** ప్రతిభకు వైకల్యం ఎట్టిపరిస్థితుల్లో అడ్డంకి కాదని దివ్యాంగులు నిరూపించారని ఏపి ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్





అన్నారు.గత నెల 25నుంచి 28వ తేది వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ నగరంలో జరిగిన జాతీయస్థాయి 14వ పారా సిట్టింగ్ వాలీబాల్ బాల బాలికల పోటీల్లో గెలుపొంది కప్ కైవశం చేసుకున్న దివ్యాంగ క్రీడాకారుల్ని తమ్మిరెడ్డి శివశంకర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు సకలాంగులతో ధీటుగా అన్ని రంగాల్లో రాణించి తమ సత్తా చాటుతున్నార న్నారు.వారిలో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభ గుర్తించి ప్రోత్సహిస్తే వారు తిరుగులేని శక్తిగా దూసుకుపోతారని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగ క్రీడాకారులు ఎంతో సాధనచేసి జాతీయస్థాయి పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో అద్భుతంగా ఆడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపేరు ప్రతిష్టలు మరింతగా ఇనుమడింప చేశారని కొనియాడారు.ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ రానున్న అన్ని జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని పిలుపునిచ్చారు.పారా వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బి.శివదత్తు మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారుల జాతీయస్థాయి పోటీలకు ముందు శివశంకర్ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపి వారు పోటీల్లో సత్తా చాటేలా వారికి ప్రేరణ కలిగించారన్నారు.ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. రానున్న కాలంలో జరగనున్న పారా సిట్టింగ్ వాలీబాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే దివ్యంగ క్రీడాకారుల అభివృద్ధికి అసోసియేషన్ ద్వారా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు.

# సమగ్ర యాజమాన్య పద్ధతుల పై శిక్షణ

**వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు), మార్చి 25, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు మండల కేంద్రంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, స్మాల్ ఆధ్వర్యంలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడిఏ యన్. మోహన్రావు,డాక్టర్.యల్.రాజేష్ చౌదరి, మరియు మండల వ్యవసాయాధికారి షేక్.సుగుణ బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ చౌదరి మాట్లాడుతూ మిరప పంటలో సర్కారు తుమ్మ (ప్రొసోఫిస్), తుత్తురుబెండ, ఉమ్మెత్త వంటి కలుపు జాతి మొక్కలు తెల్ల దోమలకు ఆవాసాలుగా ఉంటాయన్నారు. పొలం గట్లమీద ఉన్న కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు నిర్మూలించి, వైరస్ సోకిన మొక్కలను పీకేయాలని సూచించారు. సిఫారసు చేసిన మందులను మార్చిమార్చి పిచికారీ చేస్తూ, పొలంలో అక్కడక్కడ గ్రీజు లేదా ఆముదము పూసిన పుసుపు రంగు అట్టలు (810/ఎకరా)పెట్టుకొని తెల్ల దోమ ఉనికిని తెలుసుకోవడంతో పాటు దోమ ఉధృతి కొంతవరకు తగ్గించవచ్చన్నారు. తామర పురుగుల సమగ్ర యాజమాన్యం గురించి ఎకరానికి 200కేజీల వేప చెక్కను చివరి దుక్కిలో వేసుకోవాలని, పురుగు ఉధృతిని తట్టుకుని మన ప్రాంతానికి అణువుగా ఉన్న హైబ్రిడ్ రకాలను వేసుకోవాలని వివరించారు. సిఫారసు చేసిన ఎరువుల మోతాదులోనే అనగా 120:24:48 కేజీల నత్రజని, భాస్వరం,పొటాష్ ఇచ్చే ఎరువులను వినియోగించాల న్నారు. అంటే 260 కేజీల యూరియా,150 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్ మరియు 80 కేజీల మురేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఇవ్వాల్సి ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు యాజమాన్య పద్ధతి గురించి వివరిస్తూ యంత్రాలను ఉపయో గించి ప్రత్తి మోళ్లను చిన్న చిన్న ముక్కలుగా చేసి పొలంలో కలియ దున్నాలని, పంట మార్పిడి చేసేందుకు పురుగు జీవిత చక్రాలకు



విరామం పడుతుందని పేర్కొన్నారు. పంట కాలంలోనూ గోడౌన్స్ దగ్గర, జిన్నింగ్ మిల్లర్ల దగ్గర, మార్కెట్ యార్డ్ లో లింగాకర్షక బుట్టలను పెట్టి తల్లి రెక్కల పురుగులను ఆకర్షించాలని, పంట చివరి దశలో సింథటిక్ పైరేత్రాయిడ్ మందులైన సైపర్ మెత్రిన్ 25శాతం ఇ.సి.ఎకరాకు 200 మిల్లీలీటర్ లేదా లాండాసై హాలో త్రిన్ 5శాతం ఇ.సి.ఎకరాకు 200 మిల్లీలీటర్ 1లేదా రెండు సార్లు పిచ్చికారీ చేయాలన్నారు. జనవరి నుంచి జూన్ మాసం వరకు ప్రత్తి పంట లేకుండా చూసుకుంటే పురుగు జీవిత చక్రం క్రమం తప్పుతుందని, తర్వాత పంట మీద పురుగు ఉధృతి తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఏడిఏ యన్.మోహన్రావు ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.మండల వ్యవసా యాధికారిషేక్. సుగుణ బేగం రైతులకు వివిధ డిపార్ట్మెంట్ స్కీమ్ ల గురించి తెలియజేసారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల రైతులు మరియు అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా యువనేత గోనుగుంట్ల హరీష్‌బాబు జన్మదిన వేడుకలు

**వినుకొండ,మార్చి25,ప్రభాతవార్త:** ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు తనయుడు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గోనుగుంట్ల హరీష్ బాబు జన్మదిన వేడుకలు బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ కొనసాగాలని ఆకాంక్షించారు. హరీష్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా దృక్పథంతో పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్ వద్ద శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని



శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. వినుకొండ పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యం లో కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ హరీష్ బాబు అంకితభావంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తన తండ్రి బాటలో నడుస్తూ నిరంతరం ప్రజా సేవలో మల్లికార్జునరావు ప్రారంభించారు. ఎండ తీవ్రత దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వినుకొండ యార్డు చైర్మన్ మురళీయాదవ్,జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు ,శివశక్తిఫౌండేషన్ మేనేజర్ ఫణి కుమార్,పొలిటికల్ మేనేజర్ దిలీప్,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరీష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు

# ముఖ్యమంత్రి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు అధికారులు

**గుంటూరు క్రైమ్,మార్చి25,ప్రభాతవార్త:** మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహమునకు ఇద్దరు ముఖ్యమంత్రులు హాజరవుతారు కావున జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.ఈ సందర్భంగా గుంటూరు రేంజ్ ఐజిపి,జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,పోలీస్ అధికారులు ముఖ్యమంత్రి వచ్చే రూట్ లను,హెలిప్యాడ్ లను ఏర్పాటుచేసిన ప్రాంతాలలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా ఇద్దరు ముఖ్యమంత్రులును డిప్యూటీ ముఖ్యమంత్రి,వీఐపీలు దృష్టిలో ఉంచుకుని,మార్గమంతా రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, జనసంచారం నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. హెలిప్యాడ్ నుండి శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వరకు మార్గమంతా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లును,శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాలును పరిశీలించారు.

# శ్రీరామ నవమికి దేవాలయాల ముస్తాబు

**కొల్లిపర, మార్చి 25, ప్రభాతవార్త:** మండలంలోని చక్రాయపాలెం, కొల్లిపర, దావులూరు, హనుమాన్‌పాలెం, తూములూరు, గుడిబండివారి పాలెం, మున్నంగి, వల్లభాపురం, దావులూరిపాలెం, అత్తోట, యాదవపాలెం తదితర గ్రామాలలో



శుక్రవారం జరిగే శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీరానవమి ఉత్సవాలను 27వ తేదీ జరపాలని పండితులు నిర్ణయించడంతో రామాలయాల ఎదుట చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు.శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపేందుకు ఆలయ కమిటీలు సమాయత్తమవుతున్నాయి.

# కిట్స్ కళాశాలలో బైకర్ మూవీ టీం సందడి

**వట్టిచెరుకూరు, మార్చి 25, ప్రభాతవార్త :** మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రంబైకర్ మూవీ హీరో శర్వానంద్, హీరోయిన్ మాళవికా నాయర్ వచ్చి సందడి చేశారు. మూవీ ప్రమోషన్లో భాగంగా కిట్స్ కళాశాలలో విద్యార్థులు మూవీ డైలాగ్, పాటలతో అలరించారు. హీరో, హీరోయిన్ మాట్లాడుతూ.. మూవీ కథ గురించి వివరిస్తూ మొట్టమొదటిసారిగా బైక్ రైసింగ్ విభాగంతో మూవీ ఉంటుందని, మూవీ ఏప్రిల్ మూడో తేదిన విడుదలవుతుందని తెలిపారు. గతంలో మా సినిమాలు హిట్ అయిన సందర్భాలు ఉన్నా యని, ప్రస్తుతం బైకర్ మూవీని విజయవంతం చేయా లని కోరారు. విద్యార్థులు



విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పట్టు సాధించాలని కోరారు.ఈ దిశగా విద్యార్థినీ విద్యార్థినీలకు కళాశాల యాజమాన్యం మంచి తర్ఫీదును ఇవ్వాలని సూచించారు. ఒక్కొక్కరికి ఒక్కో రంగంలో ప్రావీణ్యత ఉంటుందని, తమ కళా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, విద్యను కొనసాగించాలని, అలానే తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. కళాశాల ప్రాంగణంలోకి బైకర్ మూవీ హీరో హీరోయిన్ ప్రవేశంతో విద్యార్థులు సందడి చేశారు. బైకర్ మూవీ హీరో, హీరోయిన్లను మెమెండోలతో కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయా సుబ్బారావు, సెక్రటరీ కోయా శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, వివిధ శాఖల హెచ్వోడీలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి పరీక్షలు ముఖ్యం : ఎంపిడివో

**కొల్లిపర, మార్చి 25, ప్రభాతవార్త:** ఆరోగ్య సమస్యలు పరిష్కరించడానికి మంచినీటి పరీక్షలు ముఖ్యమని ఎంపిడివో విజయలక్ష్మి చెప్పారు.బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజాప్రతినిధుల సమావేశానికి ఎంపిపి భీమవరపు పద్మావతి అధ్యక్షతవహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించే విధానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.క్షేత్రస్థాయిలో వాటర్ టెస్టింగ్ కిట్లు వాడటం ద్వారా నీటి నాణ్యతను సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు.సురక్షిత తాగునీటితో ఆరోగ్యం సమకూరుతుందని ఆమె వెల్లడించారు.ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు,ఆర్‌డబ్లూ ఎస్ ఎఇ సుధాకర్,పరిపాలనాధికారి కిశోర్‌కుమార్,డిప్యూటీ ఎంపిడివో దానయ్య,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు విధానాలతోనే అధిక లాభాలు

- రూ. 4 కోట్లతో కాలువ డ్రాపుల పునర్నిర్మాణం, కొత్త షట్టర్ల ఏర్పాటు -'రైతన్నా మీకోసం - అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల (చిలకలూరిపేట), మార్చి 25, ప్రభాతవార్త:** సేంద్రియ సాగు ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని, రసాయన ఎరువుల వాడకానికి అలవాటుపడిన రైతులు.. ఒక్కసారిగా సహజ విధానాల్లో సాగు చేపట్టడం కాస్త కష్టంగానే ఉంటుందని, కానీ భవిష్యత్ లోమంచి ఫలితాలు, అధిక లాభాలు రావాలంటే మారక తప్పదని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నాదెండ్ల మండల కేంద్రంలో 30 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయ దగ్గర ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'రైతన్నా మీకోసం – అన్నదాతా సుఖీభవ' బహిరంగసభలో ప్రత్తిపాటి మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం.. ముఖ్యమంత్రి చేసే ప్రతి ఆలోచన.. ప్రతి పనిలో ప్రజాహితమే దాగి ఉందనే నిజాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కువెళ్లిందని, ప్రభుత్వ భూములతో పాటు, ప్రజల భూములు కాజేయడానికి నాటి పాలకులు ప్రయత్నించారని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను చంద్రబాబు రద్దు చేయకుంటే.. ప్రజల భూములు రాత్రికి రాత్రే మాయమయ్యేవన్నారు. ఆర్థిక సమస్యలున్నా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం అందించడంలో కూటమి ప్రభుత్వం ఎక్కడా వెనక్కు తగ్గడం లేదన్నారు. చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి శాశ్వతంగా ఉన్నప్పుడే ఏపీ, అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ ఇంటా బయటా సంతోషంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆలోచనని, ఆయన పనితీరుకు తగినట్టుగా ప్రజలు కూడా తమ ఆలోచనా ధృక్పథం మార్చుకోవాలని ప్రత్తిపాటి హితవు పలికారు. కూటమిప్రభుత్వం సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు చేసే విస్తృత ప్రచారమే ప్రజల్లో నాటుకుపోతుందన్నారు.

30 డ్రాపులపై 30 షట్టర్లు ఏర్పాటుచేస్తున్నాం.. ప్రభుత్వ, రైతుల భాగస్వామ్యంతోనే లిఫ్టుల ఆధునికీకరణ నియోజకవర్గంలోని సాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు 30 డ్రాపుల్ని కొత్తగా నిర్మించి, వాటిపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం రూ.4 కోట్ల వ్యయంతో త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు.



అదేవిధంగా నియోజకవర్గంలోని 56 లిఫ్టుల (ఎత్తిపోతల పథకాలు) ఆధునికీకరణ పనులపై ముఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందని, ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సాయం మంజూరు చేయిస్తామని, రైతులు కొంత సమకూర్చుకొని వాటిని బాగుచేసుకోమని ఆయన సూచించారని ప్రత్తిపాటి చెప్పారు. రూ.10 నుంచి రూ.20 లక్షల్లో బాగయ్యే లిఫ్టులపై రైతాంగం తొలుత శ్రద్ధ పెట్టాలని, అంతకంటే ఎక్కువ ఖర్చయ్యే వాటికి మాత్రం, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, నాయకులు వలేటి హిమవంతరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, గ్రామ నాయకులు యనమదల సూర్య నారాయణ, వేములపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి కోటేశ్వరరావు, వేములపల్లి బసవయ్య, నెల్లూరి విజయ సారధి, నల్లమోతు అమరేశ్వరరావు, హార్టికల్చర్ అధికారిని శ్రీలక్ష్మి, అగ్రికల్చర్ ఏ.డి.ఎ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత, తహశీల్దార్, ఎంపీడీవోలు , అధికారులు, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆదాయం పెంచి, ప్రజలకు పంచాలన్నదే చంద్రబాబు ఆలోచన

-చిలకలూరిపేట సుగాలీ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించే కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన

చిలకలూరిపేట, మార్చి 25, ప్రభాతవార్త: రాష్ట్ర ఆదాయం పెంచి, ప్రజలకు పంచాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, చంద్రబాబు నాయకత్వంపై పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్లో ఉన్న



అపారమైన నమ్మకమే పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని సుగాలీ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.పెట్టుబడుల ఆదాయంతోనే ప్రజలకు లబ్ధి.. రాష్ట్రాభివృద్ధి స్వల్పకాలంలో రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రావడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ల శ్రమ, కృషి ఎంతో ఉందన్న ప్రత్తిపాటి, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయన్నారు. 20 నెలల్లో 25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వాటి యొక్క ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాలుస్తున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాక ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతోనే ప్రజలకు లబ్ధి, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దాంతోపాటే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విరివిగా లభిస్తాయని, దీంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంతోషం వస్తుందని ప్రత్తిపాటి తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ఎస్టీ సెల్ నాయకులు వడితే అంజి నాయక్, మోతి భాయి, గోవింద నాయక్, రాములు నాయక్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డి.ఈ షేక్ రియాజ్ ఉద్దీన్, ఏ.ఈ వి సుజనా, అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిజైన్ నౌ కాంపిటీషన్ ఫైనల్‌కు ఎంపికైన ఎన్.ఈ.సీ విద్యార్థులు

**రొంపిచర్ల,మార్చి 25 ప్రభాతవార్త :** నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (ఎన్.ఈ.సి) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పుసులూరి బాబు, కార్తీక్ గణేష్, మణికంఠ, సయ్యద్ రియాజ్ లు ఎంపికయ్యారు. మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు టి. తన్వీర్, కార్తీక్ మొత్తం మూడు టీములు) ఎంపిక అయ్యాయి. ఈ నెల, 26, 27 తేదీలలో జాతీయ స్థాయిలో శ్రీ రామకృష్ణ ఇంజనీరింగ్ కాలేజీ, కోయింబత్తూర్ లో ఐసీటీ అకాడమీ, ఆటోడెస్క్ లు సంయుక్తంగా నిర్వహించబోయే "ఇండియా డిజైన్ వీక్ 2026 గ్రాండ్ ఫైనల్ కాంపిటీషన్ లో పాల్గొనేందుకు అర్హత సాధించారని కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి బి. వేంకట శివ ఉన్నారు.కళాశాల వైస్ పిన్సిపాల్ డి. సునీల్ మాట్లాడుతూ ఈ పోటీలలో సౌత్ ఇండియా తరుపున షుమారు 70 కళాశాలల నుండి 100 టీములు వరకు ఎంపికయ్యాయని, వాటిలో తమ కళాశాల తరుపున మూడు టీములు ఫైనల్ కి ఎంపికయ్యా అన్నారు. కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు ఫైనల్ కి అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ లో పాల్గొనే జాబితాలో తమ కళాశాల పేరు ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు ఫైనల్ కి అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు ఫైనల్ కి అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు.

# సులభ కాంప్లెక్స్‌లలో ఉచిత మూత్ర విసర్జన సౌకర్యం కల్పించాలి : సిపిఎం

**నరసరావుపేట క్రైమ్, మార్చి 26 ప్రభాతవార్త :** నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో పట్టణ నలువైపులా ఏర్పాటు చేసిన మున్సిపల్ సులభ కాంప్లెక్స్‌లలో పరిమిత సదుపాయాలే ఉన్నాయని మూత్ర విసర్జనకు డబ్బులు వసూలు చేయడం ప్రజల్లో అసంతృప్తి నెలకొందని సిపిఎం 1వ, 2వ పట్టణ, నరసరావుపేట మండల కార్యదర్శిలు షేక్.సిలార్ మసూద్, సయ్యద్ రబ్బానీ, డి.శివ కుమారి అన్నారు. ఈ మేరకు నరసరావుపేట ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ కు వినతిపత్రం అందజేశారు.మల విసర్జన, స్నానపు గదులు మాత్రమే అందుబాటులో ఉండగా, ప్రత్యేకంగా మూత్ర విసర్జన శాలలు లేవన్నారు.దీంతో గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణానికి వచ్చే ప్రజలు, స్థానికులు, చిరు వ్యాపారులు మూత్ర విసర్జన కోసం డబ్బులు చెల్లించేందుకు ఇష్టపడక సులభ కాంప్లెక్స్‌ల సమీప ప్రాంతాల్లోనే బహిరంగ ప్రదేశాలను ఆశ్రయిస్తున్న తీరు వాహనదారులు, పాదచారులకు అసౌకర్యాన్ని కలిగిస్తుందన్నారు. 200 ఏళ్ల చరిత్ర కలిగిన నరసరావుపేట పట్టణ ప్రతిష్టకు భంగం కలిగేలా ఉందని కమిషనర్ కు వివరించారు. పట్టణ పరిశుభ్రతను కాపాడటంతో పాటు వీధి విక్రేతలు, పేద ప్రజల కోసం ఉచిత మల విసర్జన సదుపాయాలు కల్పించాలని కోరారు.

# త్రిపురాపురం మేజర్ పరిధిలో బ్రిడ్జిల నిర్మాణానికి వినతి

**నూజెండ్ల,మార్చి25,ప్రభాతవార్త:** త్రిపురాపురం మేజర్,నూజెండ్ల మేజరు నందు నూతనంగా బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ డీసీ ఛైర్మన్ గంగినేని రాఘవరావు నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కలిసి వినతిపత్రం అందజేశారు. పమిడిపాడు,చెరుకుపాలెం మధ్య కాలువ నందు రైతులు నడక కొనసాగించడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.



పైపులైన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# టిడ్కో హౌసింగ్ కాలనీలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

**చిలకలూరిపేట, మార్చి 25, ప్రభాతవార్త:** లోకకళ్యాణం కోసం, ధర్మ సంస్థాపన కోసం అవతరించిన మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుని జన్మదినమైన శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని, చిలకలూరిపేట పరిధిలోని 52 ఎకరాల టిడ్కో గృహ సముదాయంలో బిజెపి ఆధ్వర్యంలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బిజెపి



నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ, టిడ్కో నివాసితులందరి సమక్షంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతాయని తెలిపారు. ముఖ్య కార్యక్రమాలు: శ్రీ సీతారాముల వారి పూజ, భజన కీర్తనలు మరియు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ. బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు టిడ్కో కాలనీ నివాసితులు పాల్గొంటారని తెలిపారు. రామరాజ్య స్థాపనే లక్ష్యంగా, ప్రజలందరిలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడానికి, టిడ్కో లబ్ధిదారులందరిలో ఐక్యతను చాటడానికి ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా టిడ్కో కాలనీ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామచంద్రుని కృపకు పాత్రులు కావాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

# వంట గ్యాస్ బ్లాక్‌మార్కెట్ జరగకుండా హెచ్‌పి గ్యాస్ సిబ్బందికి హెచ్చరికలు

**చిలకలూరిపేట, మార్చి 25, ప్రభాతవార్త:** వంట గ్యాస్ బ్లాక్ మార్కెట్ జరగకుండా ఉండే దుకు సిబ్బంది, డెలివరీ బాయ్స్ కి హెచ్చరికలు జారీ చేశామని సాయిబాబాహెచ్‌పి గ్యాస్ ఉద్యోగి దుర్గారావు బుధవారం తెలిపారు. గ్యాస్ ఆన్‌లైన్ లో బుక్ చేసుకున్న తర్వాత 10 నుంచి 12 రోజుల్లో ఇంటి దగ్గర డెలివరీ ఇస్తున్నామన్నారు.వంట గ్యాస్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న



అనంతరం మరొక సిలిండర్ బుకింగ్ చేసుకోవాలంటే 35 రోజుల వ్యవధి పడుతుందన్నారు.

# ఏఐటియుసి జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయండి

నకరికల్లు, మార్చి 25 ప్రభాతవార్త :: ఏఐటియుసి ద్వితీయ మహాసభల కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీన స్థానిక ఎన్జీవో హోమ్ లో ద్వితీయ మహాసభలు జరగనున్నాయని ఈ మహాసభను జయప్రదం చేయాలని కాసా రాంబాబు పిలుపునిచ్చారు.ఈ మహాసభల్లో ముఖ్య అతిథిగా ఏఐటీయూసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్‌ఎస్ వెంకటసుబ్బయ్య నాయకులురాధాకృష్ణమూర్తి, బాల కాశి,మారుతి వరప్రసాద్,హుస్సేన్ తదితరులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ నాయకులుఉప్పలపాటి రంగయ్య,చక్రవరం సత్యనారాయణ రాజు, మహంకాళి సుబ్బారావు,ఎం నాగేశ్వరావు, వైదన వెంకట్, ఎస్ కె జాను సైదా, వెంకటేష్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# జియస్‌టి పై అందరకీ అవగాహన అవసరం

**పెనమలూరు మార్చి25,ప్రభాతవార్త :** జి.యస్.టి అనేది పన్ను సంస్కరణకాదు ఇది మన దైనందిన జీవితంలో ఒక భాగం అని స్టార్టప్,ఫుడ్‌డెలివరీ,క్యాబ్‌బుకింగ్ ఇలా ప్రతిదానికి జి.యస్.టి భాగమైందని ఐసియస్ యస్ఆర్ యస్ఆర్‌సి సంచాలకులు ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు.ప్రసాద్ వి.పొట్లూరి సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఐసియస్ యస్ఆర్ యస్ఆర్‌సి వారి ఆర్థిక సహకారంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వనతో ప్రారంభించారు.ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.యస్.టి భావన గరించి వివరించారు.జి.యస్.టి గూర్చి అన్ని వర్గాల వారికి తెలియవలసిన అవసరం ఎంతో ఉందని తెలిపారు.భారతదేశ ఆర్థిక చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మక పన్ను సంస్కరణ అని తెలిపారు.ఇది జూలై2017 నుండి అమలులోకి వచ్చిందని దీని ప్రధాన ఉద్దేశ్యం ఒకదేశం ఒకేపన్ను ఒకేమార్కెట్ అనే నినాదాన్ని సాకారం చేయడం అని వివరించారు.ఆర్థికవ్యవస్థలో జరిగే మార్పులను సవిస్తరంగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో విశిష్ఠ అతిథి ఆర్.శివరామప్రసాద్ ,సి.ఏ.పి.వి.సతీష్‌కుమార్, కళావాల ప్రిన్సిపల్ కె.శివాజీబాబు,కన్వీనర్ పి.ఆదిలక్ష్మి, విభాగాధిపతులు,అధ్యాపకబృందం పాల్గొన్నారు.

# ఘనంగా చట్టీ షరీఫ్ వేలమందికి అన్నదానం

**ఎ కొండూరు, మార్చి 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు బాబె ఎ బాగ్దాద్ షరీఫ్‌లో అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హాజరత్ అతావుల్లా షరీఫ్, షాతాజ్ ఖాదరీ బాబా వారి దివ్య ఆశీస్సులతో పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహిద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా, అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా బాబావారి చట్టీ షరీఫ్ షబ్‌ను అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా అండ్ దర్బార్‌కు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే గాక భారతదేశం నలుమూలల నుండి వచ్చిన వేలాది మంది అతావుల్లా బాబా భక్తులకు మహాదివ్య అన్నన వారాధ్‌న వితరణ గావించారు. అలాగే గత 3రోజుల నుండి అతావుల్లా బాబా వారి ధర్మపత్ని అమ్మాజాన్ ఖమ్రున్నీసా



బేగం 5వ ఉర్సు గంధ మహోత్సవం సందర్భంగా వేలాదిమందికి అన్నదానం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వాస్తు బ్రహ్మ జాఫర్ షరీఫ్ విజయనగరం ఖాదర్‌వలీ బాబా దర్గా ముతవల్లీ డా.ఎండి ఖలీల్ బాబు, బొగ్గాది తాజ్ ఖాదర్‌బాబు, ఖాదర్‌షా మదనిలతో పాటు జడ్పీటిసి మెంబర్ బి.గనియా నాయక్, సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు, గ్రామ వైసిపి అధ్యక్షుడు ఎం.చినలక్ష్మయ్య, డా.శ్యాంకిరణ్, మండల బిసి సెల్ వైసిపి జనరల్ సెక్రటరీ బెజవాడ తరుణ్ తదితరులు పాల్గొని చట్టీషరీఫ్ ముబారక్ తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటన రద్దు

## -జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



**బాపట్ల,మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం చీరాల మండలం పర్యటన రద్దు అయిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారంతెలిపారు. కనుక కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు బాపట్ల జిల్లా,చీరాల మండలం లో స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వలసి ఉందన్నారు. అమరావతి మార్చి 28న ఏపీ ప్రత్యేక అసెంబ్లీ సమావేశము ఉన్నందున చీరాల పర్యటన రద్దు అయిందని ఆయన తెలిపారు

# యువత స్వయం ఉపాధి వైపు ఆసక్తి చూపాలి : ఇన కొల్లు పోలీసు రావు

**కర్లపాలెం, మార్చి 25, ప్రభాతవార్త:** యువత స్వయ ఉపాధి కోర్సులు వైపు ఆసక్తి చూపాలి అని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. కర్లపాలెం స్థానిక రామకృష్ణ సేవా సమితిలో కుట్టుమిషన్లు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక రామకృష్ణ సేవా సమితి వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఏపీఎంఓ శ్రీనివాస్ రావు, పోలీసు రావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా మహిళలు వారి జీవన ప్రమాణాన్ని, ఆదాయాన్ని పెంచుకోవచ్చు అన్నారు ఈ సందర్భంగా ఎంపీడీవోశ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ గ్రామీణ శాఖ ఆధ్వర్యంలో ఈ కుట్టు మిషన్ శిక్షణ నిర్వహించినట్లుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు అరె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**గంపలగూడెం, మార్చి 25, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో వేంచేసి వున్న శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థాన నం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. ఫిబ్రవరి 11 నుండి ఈ నెల 25 వరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవాలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహనాధికారి శ్రీమతి ఎన్. సంధ్య, ఎన్టీఆర్ జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి షణ్ముఖం పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. దేవాలయంలో ఉన్న ఆరు హుండీల ద్వారా కానుకల రూపంలో రూ. 15,17,776 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కమిషనర్ సంధ్య తెలిపారు. వెండి 129 గ్రాములు, 10 ఆస్ట్రేలియా డాలర్లు కూడా భక్తులు స్వామివారి హుండీలో వేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పామర్తి కొండలరావు, వనమా చిన్న అనంత రామయ్య, గ్రామ



పెద్దలు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, పోలీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈశ్వర్ ను కమిషనర్ సంధ్య, పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు.

# చెరుకుపల్లిలో బస్ షెల్టర్ లేక నిత్యం అవస్థలు పడుతున్న ప్రయాణికులు

**చెరుకుపల్లి, మార్చి 24, ప్రభాతవార్త :** మారుమూల ప్రాంతాలకు సైతం ఆధునిక రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రమైన చెరుకుపల్లిలో నేటికీ కనీస బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. రేపల్లె తెనాలి పొన్నూరు బాపట్ల నిజాంపట్నం పట్టణాలకు రాకపోకలకు కేంద్రంగా ఉండే చెరుకుపల్లి నుండి రోజూ ఆయా ప్రాంతాలకు వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపధ్యంలో చెరుకుపల్లి సాయిబాబా టెంపుల్, అంబేద్కర్ సెంటర్లో ఆర్టీసీ బస్సులు, ఆటో తదితర వాహనాల కోసం వందల సంఖ్యలో ప్రయాణికులు వేచి చూస్తుంటారు. ఆయా వాహనాలు వచ్చేంతవరకు ఎండైనా వానైనా నడిరోడ్డుపై నిలువు కాళ్లపై నిలబడి ఉండవలసిందే. వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, పాఠశాలలకు కళాశాలకు వెళ్లే విద్యార్థిణి, విద్యార్థులు వృత్తి ఉద్యోగ వ్యాపార , రోజువారి కూలిపనులు నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్లే అనేకమంది ఇక్కడినుండి పలు వాహనాల ద్వారా తమ ప్రయాణం చేస్తుంటారు. ఆయా వాహనాల కోసం గంటల తరబడి వేచి చూస్తుండడం ఇక్కడ నిత్యకృత్యం. ఇటువంటి పరిస్థితి నేపథ్యంలో ప్రయాణికులు కాసేపు కూర్చోవడానికి కనీస వసతి లేకపోవడం నిజంగా దౌర్భాగ్యమైన పరిస్థితిగా భావించాల్సిందే. దశాబ్దాల కాలంగా ఈ పరిస్థితిని ప్రయాణికులు ఎదుర్కొంటూనే ఉన్నప్పటికీ అందుకు తగ్గ పరిష్కారం మాత్రం నేటికీ కార్యాచరణకు నోచుకోలేదు. అంతేకాదు వాహనాల కోసం గంటల తరబడి నిలువు కాళ్లపై నిలుచున్న ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఇక్కడ మరుగుదొడ్లు కూడా లేకపోవడం నేటి సమాజంలో ఇంకా ఈ దుస్థితి నెలకొనడంపై మనమందరం కూడా ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన



ఆవశ్యకత ఎంతైనా ఉంది. చిన్నపాటి విషయాలకు రోడ్డుపైకి వచ్చి నానా యాగి చేసే ఈ రోజుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏ ఒక్కరూ కూడా గట్టిగా ప్రశ్నించిన దాఖలాలు లేవు. అందుకేనేమో నేటికీ ఈ సమస్యపై పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోలేదని చెప్పవచ్చు. ఈ ప్రాంతంలో పంచాయతీకి సంబంధించి నాలుగు సెంట్లు వరకు పార్కు స్థలం ఉన్నప్పటికీ అది కాస్త ఆక్రమణకు గురైంది. ఆక్రమణకు గురైన స్థలాన్ని పంచాయితీ వారు స్వాధీనం చేసుకొని ప్రయాణికుల కోసం బస్సు సెంటర్ మరియు మరుగుదొడ్లు నిర్మించమని అనేకమార్లు ఆవేదనతో విజ్ఞప్తి చేసిన పాలకులు అధికారులు నేటికీ పట్టించుకోలేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఒక్కో మారు చెరుకుపల్లి నుండి ప్రయాణం చేయాలంటేనే ఆందోళన చెందవలసిన పరిస్థితి నెలకొన్నాయని పలువురు ప్రయాణికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు , అధికారులు స్పందించి ప్రయాణికుల ప్రయోజనాలను ముఖ్యంగా కనీస అవసరాలు దృష్టిలో ఉంచుకొని బస్ షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు సైతం విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్.ఆర్.ఐ విద్యాసంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా

**పెనమలూరు మార్చి25,ప్రభాతవార్త :** అంతర్జాతీయ ప్రమాణాలతోకూడిన విద్యను అందించడమే ధ్యేయంగా ఎన్.ఆర్.ఐ డీమ్డ్ టు బి యూనివర్సిటీ రీసెర్చ్ పరంగా ఉపాధివిద్య,ఆధునిక విద్యఅందించడమే ధ్యేయమని కళాశాల అకడమిక్ డైరెక్టర్ గుత్తా సాంబశివరావు తెలిపారు.ఏలూరు జిల్లా ఆగిరిపల్లి సమీపంలోఉన్న ఎన్.ఆర్.ఐ విద్యాసంస్థలకు యూ.జి.సి.న్యూఢిల్లీ వారు డీమ్డ్ యూనివర్సిటీ హోదాను కల్పించినట్లు విద్యాసంస్థల చైర్మన్



రావి.వెంకట్రావు తెలిపారు.బుధవారం హోదా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విలువలతో కూడిన విద్యను అందించాలని చైర్మన్‌ను అభినందించారు.2007వ సంవత్సరంలో ఎన్.ఆర్.ఐ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ,2008లో ఎన్.ఆర్.ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీని స్థాపించి,2018లో అటానమస్ హోదాను కల్పించుకొని నాక్ ఎ గ్రేడ్,ఎన్ బి ఎ టైర్ ఒన్ అక్రిడేషన్లతో అంచలంచెలుగా ఎదిగి 2026లో డీమ్డ్ టు బి యూనివర్సిటీ హోదాను పొందిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ఎం.తేజ్‌సాయి,ప్రిన్సిపల్ సి.నాగభాస్కర్ పాల్గొన్నారు.

# 2025లో 6.30 లక్షల కోట్ల ప్రయోజనాలు చెల్లించిన భారతదేశ జీవిత బీమా సంస్థలు

**విజయవాడ, మార్చి 25, ప్రభాతవార్త :**

కుటుంబాలకు రక్షణ కల్పించడం, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలకు అండగా నిలవడంలో భారతదేశపు జీవిత బీమా రంగం కీలక పాత్ర పోషిస్తూనే ఉంది. తాజా ఐఆర్‌డిఏఐ వార్షిక నివేదిక 2024-25 ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా సంస్థలు మొత్తం 6.30 లక్షల కోట్ల విలువైన ప్రయోజనాలు చెల్లించాయి. రక్షణ కల్పించడం నుండి పదవీ విరమణ, సంపద సృష్టి వరకు, జీవితంలోని వివిధ దశలన్నింటిలోనూ భారతీయ కుటుంబాలకు జీవిత బీమా రంగం అందిస్తున్న తోడ్పాటుకు ఈ గణాంకాలు ఒక నిదర్శనం.

జీవిత బీమా అనేది డబ్బు అందుబాటు, దీర్ఘకాలిక స్థిరత్వం రెండింటినీ అందించే ఒక గృహ సంపద నిల్వగా పోషిస్తున్న పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టమవుతుంది.

# మాజీ సిఎం జగన్ దృష్టికి అక్రమ కేసుల వ్యవహారం



**రేపల్లె, మార్చి 25, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గంలోని వైకాపా నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులను నమోదు చేస్తున్న వ్యవహారాన్ని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి బుధవారం వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా మోహన్‌కృష్ణ తీసుకువెళ్ళారు.తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్మోహన్‌రెడ్డిని కలుసుకుని కేసులు,పోలీసుల తీరు గురించి మోహన్‌కృష్ణ వివరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎం.నాగార్జున పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం

**నిజాంపట్నం, మార్చి 25, ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. మండలంలోని ఆముదాలపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో పందరబోయిన వెంకయ్యకు చెందిన 5 ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. ఈ సందర్భంగా ఆయన వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదం సంభవించాక బాధపడటంకన్నా ప్రమాదాలు జరగకుండా తగు



జాగ్రత్తలు తీసుకోవటం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తెదెపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 25, ప్రభాతవార్త:** భట్టిప్రోలు మండలంలోని ఓలేరు-పేటేరు క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రేపల్లె పట్టణంలోని 14వ వార్డుకు చెందిన నూతలపాటి బాబూరావు(71) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం బుధవారం ఉదయం 9.15 గంటల సమయంలో రేపల్లె నుండి స్కూటీపై అమృతలూరు వెళ్ళేందుకు బయల్దేరి 216 జాతీయ రహదారిపైకి చేరుకోవడంతో అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తల భాగంలో తీవ్ర గాయమైంది.డ్రైవంవాహనంతో పరారయ్యాడు. క్షతగాత్రుడిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించే సరికి మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. మృతుని భార్య రమణ కుమారి ఫిర్యాదు మేరకు భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వికలాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ

**పెనమలూరు మార్చి25,ప్రభాతవార్త :**

వైఎస్ఆర్ ఛారిటీస్ అధినేత యలమంచిలి జయప్రకాష్ ఆధ్వర్యంలో కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి చెందిన గరికె.ఏసు అనే వికలాంగునికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి చేతులమీదుగా బుధవారం వీల్‌ఛైర్‌ను



అందజేసారు.కానూరు వైఎస్సార్ పార్టీకార్యాలయంలో నిరుపేదలైన మహిళలకు చీరలు పంపిణీ చేసారు.వైఎస్ఆర్ ఛారిటీస్ అధినేత జయప్రకాష్ మాట్లాడుతూ పేదకుటుంబాల జీవన మనుగడకు,పోషణకు మేము అండగా ఉంటామని జాన్‌బాబు ప్రోద్భలంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మహ్మద్ సిద్దిక్,కొక్కిలిగడ్డ జాన్‌బాబు,ఈదా రాజేష్,పులిపాకకిషోర్,నందికోట కిషోర్,మంచాల సందీప్,గోగులమూడి శివ,తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లకు ఘన సత్కారం

**నిజాంపట్నం, మార్చి 25, ప్రభాతవార్త:**

మండలంలోని 15 పంచాయితీల సర్పంచ్‌లకు బుధవారం ఘన సత్కారం నిర్వహించారు. ఎంపిపి మోపిదేవి విజయనిర్మల భర్త సీనియర్ నాయకుడైన మోపిదేవి హరనాధ్ తమ హయాంలో పనిచేసిన సర్పంచ్‌లను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లతో తన అనుభవాలను పంచుకున్నారు. తనకు సహకరించిన సర్పంచ్‌లందరికి, ఎంపిటిసిలకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మీ, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఓ కార్యాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేశంలోనే అత్యంత ఎత్తైన కెఎఫ్‌సి ఇసుక బకెట్

**అమరావతి, మార్చి 25, ప్రభాతవార్త :** విశాఖపట్నం నగరంలో బీచ్ రోడ్‌లో 14వ కేఎఫ్‌సీ రెస్టారెంట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్కే బీచ్‌లో ఇసుకతో భారీ పరిమాణంలో స్థానిక స్యాండ్ ఆర్టిస్ట్ ఆకునూరు బాలాజీ వరప్రసాద్ కేవలం 7 టన్నులకు పైగా బీచ్ ఇసుకను మాత్రమే ఉపయోగించి, 48 గంటల పాటు శ్రమించి రూపొందించిన కెఎఫ్‌సి బకెట్ ఆకర్షణీయమైన ఫోటో స్పాట్‌గా మారడంతో బీచ్‌కు వచ్చినవారు తిలకించి ఆశ్చర్యానికి లోనయ్యారు. తమకు ఇష్టమైన హాట్ అండ్ క్రిస్పీ చికెన్, హాట్ వింగ్స్, చికెన్ పాప్‌కార్న్, పెరి పెరి బోన్‌లెస్ స్ట్రిప్స్, జింగర్ బర్గర్స్, రోల్స్, రైస్ బౌల్జ్ తదితర కెఎఫ్‌సి వంటకాలను అలల ఒడ్డున విహరించిన తర్వాత ఆరగిస్తారు.

# మసాలా జామ రుచితో సిప్లా హెల్త్ ప్రోలైట్ ఓఆర్ఎస్

**అమరావతి, మార్చి 25, ప్రభాతవార్త :** ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్ ఫార్ములేషన్ ప్రోలైట్ ఓఆర్ఎస్ తయారు చేసే సిప్లా హెల్త్ లిమిటెడ్ సరికొత్త మసాలా జామకాయ ఫ్లేవర్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. భారతీయ వినియోగదారులను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ఓఆర్ఎస్ నిరూపితమైన సామర్థ్యాన్ని భారతీయ రుచులతో మేళవించి హైడ్రేషన్‌ను కేవలం సమర్థవంతంగా ఆనందదాయకంగా చేస్తుంది. మసాలా జామకాయ ఫ్లేవర్‌తో పదకొండు రుచులు అందుబాటులోకి వచ్చాయని సిప్లా హెల్త్ సీఈఓ అండ్ ఎండీ శివమ్ పూరీ తెలిపారు.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

**నగరం, మార్చి 25, ప్రభాతవార్త:**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నగరం ఎస్సై బండ్ల భార్గవ్ అన్నారు. బుధవారం రేపల్లె డీఎస్పీ ఆవుల సాంబశివరావు ఆధ్వర్యంలో హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. 2024 మోటర్ వెహికల్ చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే 1000 రూపాయలు జరిమానా, లైసెన్స్ లేకపోతే 5000 రూపాయలు, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ వినియోగిస్తే 1500 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ నెలలో నాలుగు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో మృతి చెందినట్లు తెలిపారు. ప్రజల భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి ప్లకార్డులు ప్రదర్శించారు.

# నీటి వనరుల వినియోగం పై ప్రణాళిక

**నగరం, మార్చి 25, ప్రభాతవార్త:**

గ్రామాల్లో నీటి వనరుల వినియోగంపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, వార్డు మెంబర్లకు నీటి భద్రతా ప్రణాళిక పై ఒక యాక్షన్ ప్లాన్ తయారు




చేయడానికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి వనరులను అంచనా వేస్తూ ప్రజలకు ,పశువులకు మరియు ఇతర అవసరాలకు సరిపడా నీటిని నిరంతరాయం అందించడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డి. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో అబిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మలబార్ అంటే బంగారు వ్యాపారం కాదు బంగారం లాంటి మనస్సు

**విజయవాడ, మార్చి 25, ప్రభాతవార్త :** తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మలబార్ గోల్డ్ డైమాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విధ్యార్ధినులకు బుధవారం స్కాలర్షిప్‌లు పంపిణి చేశారు. ఆ క్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన మహిళా శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ఎక్కడ ఆకలి, విద్య, ఆరోగ్యం అవసరం ఉందో అక్కడ మలబార్




ఉందన్నారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు కూడ పి4 విధానంలో అందరు కలసి రావలన్నారు. బాలికల బంగారు భవిష్యత్తుకు మలబార్ గోల్డ్ ఉందని అన్నారు. ప్రతిరోజు ఆహారం అందించడం, ఓల్డేజ్ హోం స్థాపించడం, 2800 విధ్యార్ధులకు 2.52 కోట్ల రుపాయలు మొత్తం 200కోట్ల రుపాయలు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. కార్పోరేట్ సంస్థలు మలబార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆనంతరంఏపి తెలంగాణ మలబార్ గోల్డ్ డైమాండ్స్ మార్కెటింగ్ డిప్యూటీ హెడ్ రాకేష్ మాట్లాడుతూమైక్రో లెర్నింగ్ సెంటర్లు 64 వేల మంది విధ్యార్థులను మళ్ళీ స్కూల్ వెళ్ళే విధంగా ఇంకా లక్షమందికి మైక్రో లెర్నింగ్, త్రాగునీరు అందచేస్తున్నామని మెడికల్ క్యాంపుల ద్వారా మలబార్ మందుల దుకాణాల ద్వారా సబ్సిడిపై మందులు మలబార్ గోల్డ్ డైమండ్ ఛారిటి ద్వారా అందిస్తున్నామని, మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపి అహమ్మద్ సేవలు అభినందనీయమని అన్నారు.సిద్దార్థ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ పద్మజా మాట్లాడుతూ నేను అందులో భాగస్వాములు అయ్యామన్నారు. స్కాలర్ షిప్ తీసుకునే వారు స్కాలర్షిప్ ఇచ్చే విధంగా ఏదగాలని ఆకాక్షించారు.ఎమ్మెల్యే గద్దె రాంమోహన్ రావు, మురళి, షోరూమ్ హెడ్ ఆర్జన్, నదీర్ స్థానిక కమ్యూనిటి సభ్యులు పాల్గొన్నారు

## గుంటూరు నగరాన్ని పచ్చదనం అభివృద్ధితో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలి

### నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 25, ప్రభాతవార్త :** గుంటూరు నగరాన్ని పచ్చదనం అభివృద్ధితో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్



పరిధిలోని పార్క్ లు, సెంట్రల్ డివైడర్లు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, పార్క్ ల నిర్వహణలో స్థానిక కమిటిలను భాగస్వాములను చేయాలని ఎస్ఈ, ఏడిహెచ్ లకు స్పష్టం చేశారు. బుధవారం తన చాంబర్ లో కమిషనర్ పార్క్ ల అభివృద్ధి, నగరంలో పచ్చదనం పెంపుపై ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏడిహెచ్ శాంతిలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 32 పార్క్ లను, సెంట్రల్ డివైడర్లలో పచ్చదనం పెంపు ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్ ల వారీగా వాకింగ్ ట్రాక్ మరమత్తులు, మొక్కలు, ఇతర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. పార్క్ ల అభివృద్ధిలో స్థానికంగా ఉండే వాకర్స్ అసోసియేషన్లు లేదంటే ఇతర సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. డివైడర్లలో చాలా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని, వాటిని తొలగించి, ప్రస్తుత వేసవిలో సమస్యలు రాకుండా నీటిని అందించాలన్నారు. ఇప్పటికే రోడ్ల వెంబడి నాటిన మొక్కలు ఎక్కడైనా ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు.

## భారతీయుల స్వేచ్ఛ కోసం అగ్ని పథంలో నడిచిన మహావీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

**పెదనందిపాడు, మార్చి 25, (ప్రభాతవార్త):** పెదనందిపాడు లోని నందిపాఠశాల. అశోక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బుధవారం ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఆజాద్ హిందు ఫౌజ్ ఆర్మీ వ్యవస్థాపకుడు, భారత స్వాతంత్రోద్యమంలో ప్రాణాలర్పించిన భరతమాత ముద్దు బిడ్డ శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్ర గురించి అవగాహనా కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్, కీ నోట్ స్పీకర్ గా పెదనందిపాడు కళాశాల



పూర్వ విద్యార్థి.రిటైర్డ్ హిస్టరీ లెక్చరర్ తోటకూర వెంకట నారాయణ వ్యవహరించారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య. అధ్యాపకులు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయు లు విద్యార్థుల తో కలసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నంది స్కూల్. అశోక పాఠశాల విద్యార్థిని విద్యార్థుల ను ఉద్దేశించి అనర్గళంగా ప్రసంగించారు.భారత దేశం కొరకు స్వాతంత్రోద్యములో కొన్ని లక్షల మంది ప్రాణత్యాగం చేశారని. వారిలో నేతాజీ ప్రయాణం కీలకమైనదని వారు అతి చిన్న వయసులో తన కుటుంబం కన్నా దేశానికే ప్రాముఖ్యతను ఇచ్చి అతివాద నాయకుడిగా నాటి బ్రిటీష్ గవర్నమెంట్ నుండి ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని దేశ స్వతంత్రం కొరకు ఉద్యమించారని నేతాజీ చిన్ననాటి నుంచే దేశభక్తి భావంతో పెరిగారన్నారు. ఆయన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నార ని .1938 మరియు 1939లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కానీ స్వాతంత్రం సాధనలో తక్షణ చర్యలు అవసరమని భావించి నాటి మితవాద నాయకులతో విభేదించారు.ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ను విడిచి 1939లో ఫార్వర్డ్ బ్లాక్ ను స్థాపించారు. దీని ద్వారా ఆయన స్వతంత్ర పోరాటాన్ని మరింత దృఢంగా కొనసాగించార నీ పేర్కొన్నారు.బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జర్మనీ, జపాన్ వంటి దేశాల సహాయం కోరారు. అంతర్జాతీయ స్థాయిలో భారత స్వాతంత్ర్య పోరాటాన్ని చాటి చెప్పారన్నారు. వారి నాయకత్వంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ను బలపరిచారు. ఈ సైన్యం నాటి బ్రిటీష్ పాలకులపై యుద్ధం చేసి స్వాతంత్ర్యం సాధించేందుకు కృషి చేసింది.1943లో సింగపూర్లో ప్రొవిషనల్ గవర్నమెంట్ ఆఫ్ ఫ్రీ ఇండియా ను ఏర్పాటు చేసి స్వతంత్ర భారతానికి సంకేతంగా నిలిచారన్నారు"తుమ్ ముఝే ఖూన్ దో, మై తుమ్హే ఆజాదీ దూంగా" అనే నినాదం ద్వారా యువతలో ఉత్సాహాన్ని నింపారు. అనగా"మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను." అని అర్థం. దీని భావం: స్వాతంత్రం అనేది ఉచితంగా లభించదు; దాని కోసం త్యాగం, సాహసం, సంకల్పం అవసరం. యువత తమ ప్రాణాలను కూడా సమర్పించుకోవడానికి సిద్ధంగా ఉంటేనే, నిజమైన స్వాతంత్రం సాధించగలమని నేతాజీ చెప్పిన ఈ వాక్యం నేటి తరానికి కూడా ఉత్తేజాన్నిస్తుంది. వారి జీవితం త్యాగం, ధైర్యం, అంకితభావానికి ప్రతీకగా నిలిచిందని. నేటి యువతకు గొప్ప స్ఫూర్తి అన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో అజరామరమైన పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత గాథ ప్రతి విద్యార్థికి ధైర్యం, దేశభక్తి, త్యాగస్ఫూర్తి అనే విలువలను నేర్పిస్తుంది. ఆయన ఆశయాలు మనకు మార్గదర్శకం, ఆయన సంకల్పం మనకు ప్రేరణ. ఈ సెమినార్ ద్వారా యువతలో దేశ సేవా భావం పెంపొందించి, భవిష్యత్తు నాయకులుగా ఎదగడానికి ప్రేరణ కల్పిద్దాం అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మరియు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ "త్యాగమే ధ్యేయంగా, సాహసమే ఆయుధంగా – భారత మాతకు స్వాతంత్రం అంటే జీవితాన్ని అర్పించిన మహానాయకుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత ప్రయాణం నేటి తరానికి ఒక స్ఫూర్తి. ఆయన ఆలోచనలు, దేశభక్తి, సంకల్పబలం మనలో స్వయం ప్రేరణను రగిలించాలి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమములో పాల్గొన్న పాఠశాలల ఉపాధ్యాయులు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు తోటకూర వెంకట నారాయణ ను పట్టు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్యతో పాటు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ. అశోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్. పోపూరి లక్ష్మీనారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు కాంస్య పతకం

**వట్టిచెరుకూరు, మార్చి 25, ప్రభాతవార్త :** మహారాష్ట్రలోని పూణేలోగల శ్రీ శివ ఛత్రపతి స్టేడియంలో ఈ నెల 19 నుంచి 22 వతేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసు పురుషుల ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు కాంస్య పతకం సాధించిందని విఙనంపాడు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీఈటి ఎం. వీరయ్య బుధవారం






తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్, ఖోఖో క్రీడాకారుడు వీరయ్య, హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ..లీగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు బెంగళూరు, కర్ణాటక, పుదుచ్చేరి, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ కి చేరుకుందని వివరించారు.క్వార్టర్ ఫైనల్లో ఆర్సిబి చెన్నై పై గెలుపొంది సెమీస్ కు చేరుకుందని తెలియజేశారు. సెమీస్ లో మహారాష్ట్ర చేతిలో ఓటమి చవిచూసిందన్నారు. తృతీయ స్థానానికి జరిగిన పోటీలో 6 4 స్కోర్ తో హర్యానాపై సంచలన విజయం నమోదుచేసి కాంస్య పతకం చేజిక్కించుకుందని చెప్పారు. పిఎల్వి కుమార్, ఎస్. సురేష్ కుమార్, ఎస్.కిరణ్ కుమార్, డి. రాజ్ కుమార్, పి. సతీష్, జి.చిన్ని, ఎం.ముత్తు, జి.దేవేంద్ర, పి.రవిబాబు, ఏం.వీరయ్య, ఎన్.రాజా, కె. రమేష్, జి.సంతోష్, ఎస్.ఆదర్శ్, ఎస్.చంద్రమోహన్ లు జట్టు విజయానికి కృషి చేశారని పేర్కొన్నారు. వీరిలో మన పాఠశాలకు చెందిన పీఈటి వీరయ్య ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టు గెలుపుతో కాంస్య పతకం పొందేందుకు విశేషకృషి చేశారని కొనియాడారు.రాష్ట్ర జట్టు పతకం సాధించడం పట్ల రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మడక ప్రసాద్, కె.హనుమంత రావు, జిల్లా ఖోఖో అధ్యక్షులు, కార్యదర్శి వీరభద్రా రెడ్డి, సిహెచ్.పుల్లయ్య అభినందనలు తెలిపారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీనివాసరావు (లెక్కలు), శ్రీనివాసరావు (ఇంగ్లీష్), ఆదినారాయణ (పిఎస్), ఝాన్సీ రాణి (ఎన్ఎస్), మాలిక (హిందీ), చంద్రిక (తెలుగు) నాగేశ్వరరావు (సోషల్), మండల టిడిపి అధ్యక్షులు మర్రి సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నార్నె బాబు, సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ నార్నె సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు ఉప్పుటూరి సుజాత, గ్రామ మాజీ సర్పంచ్ గుంటుపల్లి చింపరయ్య, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, గ్రామ వివిధ పార్టీల నేతలు వీరయ్యను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## భాష్యం అభ్యున్నతిలో గోపి సేవలు మరువలేనివి : చైర్మన్ భాష్యం రామకృష్ణ

**గుంటూరు విద్య, మార్చి 25, ప్రభాతవార్త :** భాష్యం కుటుంబంలో భాగస్వాములైన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే సత్సంకల్పంతో భాష్యం పేరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భాష్యం గోపి సార్ మెమోరియల్ వెల్నెస్ కార్డును అందజేస్తున్నట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం భాష్యం గోపి 10వ వర్ధంతి సందర్భంగా భాష్యం మెయిన్ క్యాంపస్ లో భాష్యం గోపి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, చైర్మన్ రామకృష్ణ చేతులమీదుగా భాష్యం గోపి సార్ మెమోరియల్ వెల్నెస్ కార్డును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల అభ్యున్నతిలో గోపి పాత్ర మరువలేనిదన్నారు. గోపి



స్మృత్యర్థం భాష్యంలో పనిచేస్తున్న 15 వేల మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు ఈ వెల్నెస్ కార్డు ద్వారా ఉచిత కంటి పరీక్షలు, దంత, గుండె, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కొన్ని నిర్దిష్ట వైద్య సేవల్లో రాయితీలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మెడెక్స్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ యూనిట్ చీఫ్ అప్తమాలాజిస్ట్ డాక్టర్ యర్రారపు మాధవీ లత, కమ్మజన సేవా సమితి గౌరవ అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు గోరంట్ల పున్నయ్య చౌదరి, భాష్యం సిబ్బంది భాష్యం గోపి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి నివాళులర్పించారు.

## 27న శ్రీరామనవమి శోభాయాత్ర

**గుంటూరు విద్య, మార్చి 25, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో శ్రీరామ ఉత్సవ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి నాడు శ్రీరామ నవమి శోభాయాత్ర యొక్క పత్రిక సమావేశం కొత్తపేట లోని శివాలయం దేవస్థానంలో బుధవారం జరిగింది. ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు కారం శెట్టి లోకేష్ గుప్తా మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా గుంటూరు నగరంలో శ్రీరామనవమి నాడు శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నామని ఎప్పటి లాగే ఈ ఏడాది తొమ్మిదవ సంవత్సరం బృందావన గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి ఈ యాత్ర మొదలవుతుందన్నారు. గుంటూరు నగరంలో ఉన్న ప్రముఖ దేవాలయాల మీదుగా ఈ యాత్ర సాగుతుందని శ్రీరామనవమి



రోజున ఉదయం 9 గంటలకు మొదలయ్యే శ్రీరామ నవమి శోభాయాత్ర బృందావన్ గార్డెన్స్,పట్టాభిపురం, నగరంపాలెం,హిందూ కాలేజ్, హనుమాన్ సెంటర్, బస్టాండ్ రోడ్,పాత గుంటూరు హనుమాన్ దేవాలయం,జెండా టవర్ కన్యకా పరమేశ్వరి అమ్మవారి టెంపుల్,చివరగా రామనామ క్షేత్రం చేరటంతో ముగుస్తుందని ఆయన తెలిపారు. ఈ శోభాయాత్రలో ముఖ్యఅతిథిగా తెలంగాణ మెదక్ జిల్లా ఎంపీ రఘునందన్ మరియు గుంటూరు తాళ్లయ్య పాలెం పీఠాధిపతి శివ స్వామి గుంటూరు నగరంలో ఉన్న హనుమాన్ భక్తులు మరియు రామభక్తులు,హిందూ కార్యకర్తలు పాల్గొంటారని.. గుంటూరు నగరంలో ఉన్న హిందువులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు కారంచెట్టి లోకేష్ గుప్తా మరియు సమితి సభ్యులు వేణుగోపాల్, చల్లా బ్రహ్మ రెడ్డి, ఫణింద్ర, జానకి,మహేష్ ప్రవీణ్, లక్ష్మను, మధు, సుబ్బారావు, చరణ్ ,అంకారావు, పాల్గొన్నారు..

## భవిష్యత్ క్రీడాశాస్త్రంలో ఏఐ కీలకశక్తిగా రూపాంతరం : రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి25, ప్రభాతవార్త:** భవిష్యత్ క్రీడా శాస్త్రంలో కృత్రిమమేధ కీలకశక్తిగా రూపాంతరం చెందుతుందని ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని శారీరక విద్య – క్రీడా శాస్త్రాలలో కృత్రిమ మేధస్సు అభివృద్ధి ధోరణులు అనే రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రెక్టార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఉత్తమ పత్రాలు సమర్పించిన పరిశోధకులకు సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్.పాల్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీ యాజమాన్యం ప్రోత్సహిస్తే ఇటువంటి సదస్సులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. సదస్సులో ఆచార్య పి.చిన్నపరెడ్డి, ఆచార్య జోస్ జేమ్స్(కేరళ), ఎన్ఏపిఇఎస్ఎస్ సభ్యులు ప్రొఫెసర్ వివి బిఎన్ రావు, ఎన్ఐటి వరంగల్ నుంచి ఆచార్య పి.రవికుమార్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



## నేటి బిఆర్ స్టేడియంలో మల్టీ పర్పస్ భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### - పార్టీ శ్రేణులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపు



**గుంటూరు, మార్చి25,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ పండుగకు సిద్ధం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కేడర్ కు పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రేపు 26న బిఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవన సముదాయాల శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులతో బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు నేలపై పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ను ప్రపంచ పటంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాకే తెలుగు ప్రజలు తలెత్తుకొని నిలబడేలా ఆత్మ గౌరవాన్ని కాపాడినట్లు చెప్పారు. అలాంటి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించాలని



పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ స్టేడియం అభివృద్ధి కోసం అసెంబ్లీలోనూ ప్రస్తావించానని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బిఆర్ స్టేడియం అభివృద్ధికి బాటలు వేశామని స్పష్టం చేశారు. ఖేల్ ఇండియా కార్యక్ర మంలో భాగంగా 14 కోట్ల నిధులు మంజూర య్యాయని, వీటి ద్వారా మల్టీపర్పస్ భవన నిర్మాణాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చేతుల మీదుగా ప్రారంభించ బోతున్నామని, ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఎస్ఆర్ఎంలో అమరరాజా సెంటర్ విస్తరణ

### - రెండో దశ పనులకు కీలక ప్రతిపాదనలు -వర్సిటీ ప్రొఫెసర్లతో సమావేశమైన అమరరాజా బృందం

**మంగళగిరి, మార్చి 25, ప్రభాతవార్త :** బ్యాటరీస్ తయారీలో అగ్రగామిగా పేరుగాంచిన అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్ అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉన్న ఎనర్జీ స్టోరేజ్ డివైజెస్ సెంటర్ ను విస్తరించేందుకు



ముందుకు వచ్చింది. 2020లో యూనివర్సిటీ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎనర్జీ స్టోరేజ్ డివైజెస్ సెంటర్ లో పరిశోధనలను విస్తృతపర్చడమే కాకుండా ఇప్పటి పరిశ్రమలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సమాయత్తమవుతోంది. ఈ మేరకు ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొఫెసర్లు సిద్ధం చేసిన కీలక ప్రతిపాదనలపై సమక్షించింది.బుధవారం ఉదయం యూనివర్సిటీకి విచ్చేసిన అమరరాజా సాంకేతిక బృందం యూనివర్సిటీలోని అమరరాజా సెంటర్ నిర్వహణ బాధ్యతల్లో ఉన్న ప్రొఫెసర్లతో సమావేశమైంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి. నారాయణరావుల పర్యవేక్షణలో జరిగిన ఈ కీలక సమావేశంలో రెండో దశ కింద సెంటర్ను అభివృద్ధి పరిచే అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా వీసీ సతీష్ కుమార్ యూనివర్సిటీ ప్రత్యేకతను, ఇక్కడ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. అమరరాజ సెంటర్ పనితీరును ప్రశంసించి దానిని అభివృద్ధి పరిచే విషయంలో సమగ్ర సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు అమరరాజా ఎనర్జీ స్టోరేజ్ సెంటర్లో పరిశోధనలు కొనసాగిస్తున్న ప్రొఫెసర్లను అమరరాజా బృందానికి పరిచయం చేసి వారు చేస్తున్న పరిశోధనలను వివరించారు. ఈ సందర్భంగా రెండో దశ ఆబ్జెక్టివ్ లను వెల్లడించారు. బ్యాటరీల్లో ఎలక్ట్రో థర్మల్ మోడల్ డెవలప్మెంట్, ఎన్ఎంసీ టైపు బ్యాటరీ మెటీరియల్స్ రిసైక్లింగ్ వంటి అంశాలపై మరింత పరిశోధనలు జరిపి పరిశ్రమలకు అనుగుణంగా అయా టెక్నాలజీని చేరువ చేయాల్సిన అవసం ఉందన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ మారం పార్థసారథి, డాక్టర్ సుజిత్ కల్లూరింతో పాటు పలువురు రీసెర్చ్ ప్రొఫెసర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి రీసెర్చ్ మరియు 2వ దశ ప్రతిపాదనలను వివరించారు.ఈ సమావేశంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్ నుంచి డాక్టర్ ఇషహాప్ హాన్, డాక్టర్ రవి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుశోజన్, డాక్టర్ భువనేశ్వర్, డాక్టర్ ప్రిసిల్లా గ్రేసు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సులో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**మంగళగిరి, మార్చి 25, ప్రభాతవార్త :**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో మార్చ్ 23, 24 తేదీల్లో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ వారిచే స్పాన్సర్ చేయబడిన, "మేధో మంథన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసిస్టెడ్ డ్రగ్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్" అనే అంశం పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో యూనివర్సిటీ విద్యార్థులతో పాటు అనేక ఫార్మసీ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సదస్సులో విద్యార్థులందరికీ "ఇన్నోవేటివ్ ఐడియా" పోటీలు నిర్వహించగా, నిర్మల ఫార్మసీ కళాశాలలో బి. ఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు డా. యు. స్పందన ఆధ్వర్యంలో ఎన్.ఇందు, ఎన్. జాహ్నవి తృతీయ బహుమతిని గెలుపొందగా, మిస్.ఎస్.స్వాతి మార్గదర్శకం చేసిన ఆర్. సాయిమోనిక మరియు వి. శ్రీలత కన్సోలేషన్ బహుమతిని గెలుపొంది తమ ప్రతిభను కనబరిచారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉత్సాహంగా సదస్సుల్లో పాల్గొని, విజయాలు సాధించాలని సూచించారు. నిర్మల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి. పాముల రెడ్డి బహుమతి పొందిన సదస్సులో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.



## అంజుమన్ కమిటికు మరో డైరెక్టర్ రాజీనామా

**పొన్నూరు, మార్చి 25,ప్రభాతవార్త:** అంజుమన్ కమిటిలో డైరెక్టర్‌గా ఉన్న సయ్యద్ జానీ బాషా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల అంజుమన్ కమిటి ఒంటెద్దు పోకడకు, ఇచ్చిన మాట తప్పినందుకు నిరసనగా అంజుమన్ కమిటీలో సభ్యులు ఒక్కొక్కరుగా రాజీనామాలు చేస్తున్నారు. ఇప్పటికే గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము), డైరెక్టర్లుగా ఉన్న నాగూర్‌బాషా, షేక్ ఇషాక్‌లు రాజీనామా చేశారు. బుధవారం మరో డైరెక్టర్ సయ్యద్ జానీ బాషా రాజీనామా చేశారు. సంవత్సరం క్రితం ఏర్పాటైన నూతన అంజుమన్ కమిటి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పిందన్నారు. ఇటీవల రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంలో ఓ వ్యక్తి వివాదాస్పద వ్యాఖ్యలకు అంజుమన్ కమిటి స్పందించకపోవడం, అంజుమన్ కమిటి చేస్తున్న కార్యాక్రమాల గురించి కొంతమంది డైరెక్టర్లకు సమాచారం ఇవ్వకపోవడం ఇలాంటా అనేక కారణాలను ఉదహరిస్తూ అంజుమన్ కమిటి ఒంటెద్దు పోకడలపై నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పటికే కొంత మంది డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఇంకెంతమంది వీరి బాటలో నడుస్తారోనని ముస్లీం నాయకులు చర్చించుకొంటున్నారు. అయితే ఈ రాజీనామాలను నిలువరించే విషయంలో అంజుమన్ కమిటి ఏ విధంగా స్పందించకపోవడంతో అంజుమన్ కమిటికీ రాజకీయ రంగు పులముకుంటుందేమోనన్న అనుమానం ముస్లీం వర్గాల్లో కలుగుతుంది. అసలు అంజుమన్ కమిటీలో గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి,సహాయ కార్యదర్శి, కోశాధికారితో పాటు మరో ఐదుగురినో ఆరుగురినో సభ్యులుగా నియమించుకోవాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఏకంగా 42మందిని డైరెక్టర్లుగా నిర్మించుకోవడం జరిగింది. అందులో వైకాపా సానుభూతిపరులు సుమారు 10మంది కాగా మిగిలి వారంతా టిడిపి సానుభూతి పరులని చెప్తున్నారు. కొంత మందేమో అంజుమన్ కమిటికీ రాజకీయరంగు పులమవద్దని, ఇప్పటికైనా ముస్లీం పెద్దలు కలుగజేసుకొని అంజుమన్ కమిటీకి శస్త్ర చికిత్స చేయాలని కోరుతున్నారు. రాజీనామాలు చేసినవారు చెప్తున్న మాటల్లో వాస్తవం లేదని కొంత మంది చెప్తున్నారు. షాదీఖానాను అంజుమన్ కమిటీలో విలీనం చేస్తామని కమిటి సభ్యులు అప్పట్లో చెప్పారని కొంత మంది, చెప్పలేదని మరికొంత మంది వాదించుకొంటున్నారు. ఇలాంటి వాదనలు చిలికి చిలికి గాలివానగా మారకముందే ముస్లీం పెద్దలు అంజుమన్ కమిటిపై వస్తున్న ఆరోపణలకు తెరదించేలా ఆలోచన చేయాలని పలువురు ముస్లీం నాయకులు కోరుతున్నారు.



## అక్రమ కేసులకు భయపడం

**పొన్నూరు, మార్చి 25,ప్రభాతవార్త:** ఇటీవల అక్రమ కేసులో జైలు జీవితం గడిపి బెయిలుపై విడుదలైన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పరామర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా తనపై అక్రమ కేసు నమోదు చేశారని పిన్నెల్లి అంబటి తో చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా తగ్గేదేలేదని పిన్నెల్లి అంబటితో చెప్పారు. రాజకీయ నాయకులు ఈ అక్రమ కేసులు కొత్తేమీ కాదన్నారు. అక్రమ కేసులు బనాయించినంత మాత్రాన తమ పోరాటం ఆగదని ఇరువురు స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వారు కోరారు.

## మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమావిళ్లకు గోవాడ అభినందనలు

**మంగళగిరి, మార్చి 25, ప్రభాతవార్త :** మంగళగిరి రూరల్ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణలో విశేషంగా కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సేవ పురస్కారంకు ఎంపికైన రూరల్ ఎస్సై చిరుమావిళ్ల వెంకట్ ను రాష్ట్ర యువ కాపునాడు ప్రధాన కార్యదర్శి గోవాడ దుర్గారావు కలిసి అభినందించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ప్రజా దర్బారు కార్యక్రమంలో విధుల నిర్వహణకు ఎస్సై హాజరయ్యారు. విధుల నిర్వహణ అనంతరం ఎస్సై వెంకట్ ను గోవాడ కలిసి పరమేశ్వరుని శేష వస్త్రంతో సత్కరించి డైరీ, పెన్ను అందజేసి అభినందించారు. ఎస్సై వెంకట్ శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలకు మరింత సేవలందించి, ప్రజల మన్ననలు తోపాటు మరిన్ని ప్రభుత్వ అవార్డులు పొందాలని, పరమేశ్వరుని ఆశీస్సులు మెండుగా ఉండాలని గోవాడ ఆకాంక్షించారు.



## విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

### -డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ శ్రీనివాస్

**పొన్నూరు, మార్చి 25,ప్రభాతవార్త:** విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరమని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెప్పారు. స్థానిక 30వ వార్డులో ఓ అపార్టుమెంట్‌లో విద్యుత్ చౌర్యం జరుగుతుందన్న ఫిర్యాదుతో బుధవారం



విద్యుత్‌శాఖాధికారులు, విజిలెన్స్ అధికారులు అపార్టుమెంట్ వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ భవన యజమాని విద్యుత్ బిల్లు చెల్లించని కారణంగా భవనానికి విద్యుత్‌ను కట్ చేసినట్లు విద్యుత్‌శాఖాధికారులు చెప్పారు. అయితే విద్యుత్ కట్ చేయడంతో అందులో నివసించేవారంతా పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు వైర్లను తగిలించి విద్యుత్ చౌర్యాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకొన్న విజిలెన్స్ ఎస్సై రెహమాన్, విద్యుత్‌శాఖ పట్టణ ఎఈ రావూరి విజయ శంకరరావు, సిబ్బంది భవనం వద్దకు వచ్చి భవన యజమానిపై అక్రమ విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఛోరీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సంబంధిత భవన యజమానిపై కఠిన చర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు.

### వార్త ప్రభావం

**పొన్నూరు, మార్చి 25,ప్రభాతవార్త:** ఈ నెల 22వ తేదీన వార్త దినపత్రికలో ప్రభుత్వ స్థలాలపై కినుక ఏలా...? అనే కథనానికి ఎట్టకేలకు మునిసిపల్ అధికారులు స్పందిం చారు. సీఆర్‌డిఏ, మునిసిపల్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్ వేసి స్థలాలను విక్రయిస్తు న్నారన్న అంశంపై మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయం పట్టణ ప్రణాళికాధికారి రఘురాం మాట్లాడుతూ అక్రమ లే అవుట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామన్నారు. సంబంధిత స్థలంలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు నిర్వహించకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ వ్రాసినట్లు చెప్పారు.

